ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 15 | జూన్ | 2024
పేజీలు 7

## పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించండి




సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

7 లో

# సైద్ధాంతిక శిక్షణతోనే విస్తరణ

-పోరాటాలతోనే హక్కుల సాధన : మహ్మద్ యూసూఫ్
-సిద్ధాంతం తెలిస్తే పరిష్కారం సులభం
-కమ్యూనిస్టులతోనే సమాజం మార్పు : ప్రొ॥ యుగల్ రాయ్
-ప్రమాద అంచుల్లో చేర్చిన మతోన్మాదం : ప్రొ॥ కాశీం
- ప్రారంభమైన రాజకీయ శిక్షణా తరగుతులు






ప్రజాపక్షం/ ఖమ్మం : పోరాటాలతోనే హక్కులు సాధించబడతాయని పోరాడకుండా ఎక్కడ, ఎప్పుడు ప్రజా అనుకూల చట్టాలు లేదని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ యూసూఫ్ తెలిపారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం హరించి వేసిందని ఆయన ఆరోపించారు. సిపిఐ రాజకీయ శిక్షణా తరగతుల్లో భాగంగా శుక్రవారం లేబర్ కోడ్స్ కార్మిక వర్గం పై ప్రభావం అనే అంశాన్ని ఆయనర బోధించారు. 1881లో మొట్ట మొదటి చట్టం వచ్చిందని దానినే ఫ్యాక్టరీస్ యాక్ట్‌గా పేర్కొంటుందన్నారు. దేశంలో తొలి సమ్మె 1827 ప్రాంతంలో జరిగిందని పల్లకిమోసే బోయలు తొలిసారి సమ్మె చేశారని ఆ తర్వాత వారికి మద్దతుగా పడవలు నడిపే వారు సమ్మెలో పాల్గొన్నారని యూసూఫ్ తెలిపారు. పల్లకి బోయలతో ప్రారంభమైన సమ్మె భారతదేశంలో అనేక చారిత్రాత్మక సమ్మెలకు,

మిగతా 2లో..

-పురోగమన ఆధునిక భారతం మార్క్సిజంతోనే సాధ్యం
- సమ సమాజ స్థాపనే లక్ష్యంగా ముందుకు సాగుదాం : కూనంనేని
- మతోన్మాదపు విష భావజాలం నుండి దేశాన్ని కాపాడుకోవాలి : ప్రొ.ఖాసీం
- ప్రారంభమైన రాజకీయ శిక్షణా తరగుతులు
- జెండా ఎగురవేసిన కూనంనేని






ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : దేశంలో నానాటికీ గతి తప్పుతున్న, మితిమీరిన పరిస్థితులు గాడిలో పడాలన్నా, పురోగమన ఆధునిక భారతాన్ని చూడాలన్నా మార్క్సిజ సిద్ధాంతం ఒక్కటే దిక్కని స్థానిక శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ కేంద్రంగా రెండు రోజుల పాటు జరుగుతున్న సిపిఐ రాజకీయ శిక్షణ తరగుతులను ఆయన మొదటి రోజైన శుక్రవారం సిపిఐ జెండా ఎగురవేసి ప్రారంభించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కూనంనేని మాట్లాడుతూ మానవునికి మెరుగైన జీవన విధానాన్ని అందించగలిగేది మార్క్సిజం మాత్రమే అని, సామాజిక ఆర్థిక అసమానతలను రూపుమాపి సమ సమాజ స్థాపన జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారతదేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక భావాలను, ప్రజల

మిగతా 2లో..

## మహాసభలలో భవిష్యత్ కార్యాచరణ

-జర్నలిస్టుల సమస్యలపై విస్తృత చర్చ
-టియుడబ్ల్యూజె అధ్యక్ష, కార్యదర్శులు నగునూరి శేఖర్, విరహత్




2 లో

## రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

-వ్యవసాయం, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి
-జెడ్పి సమావేశంలో మంత్రి తుమ్మల



6 లో

# సైద్ధాంతిక శిక్షణతోనే విస్తరణ










**(మొదటిపేజీ తరువాయి)**

ఆందోళనలకు ఊపిరి పోసిందని యూసూఫ్ తెలిపారు. సుదీర్ఘ ఉద్యమ ప్రస్తానంలో కార్మిక వర్గం అనేక చారిత్రిక ఉద్యమాలను నిర్వహించిందని ఉద్యమ ఫలితాలను కార్మిక వర్గం పొందిందన్నారు. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీలో సైతం హక్కుల కోసం అనేక పోరాటాలను నిర్వహించడం జరిగిందని కాని పాసిస్టు మోడీ ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపడమే కాక ఉన్న కార్మిక చట్టాలను సవరించడానికి, లేబర్ కోడ్స్ తో అనేక మంది త్యాగాలతో సాధించబడిన హక్కులు హరించబడ్డాడయన్నారు. కార్పొరేట్ శక్తుల కోసం తప్ప మోడీ ప్రభుత్వం సామాన్యుల కోసం పని చేయలేదని ఆయన ఆరోపించారు.

**కమ్యూనిస్టులతోనే సమాజ మార్పు : యుగల్ రాయలు**

కమ్యూనిస్టులతోనే సమాజంలో ఆశించిన మార్పు వస్తుందని నాగపూర్ యూనివర్సిటీ ప్రొ॥ డాక్టర్ యుగల్ రాయలు తెలిపారు. కమ్యూనిస్టులు సమాజాన్ని మార్చగల స్థాయి రావాలంటే ప్రతి కార్యకర్త రాజకీయ సైద్దాంతిక అవగాహన కలిగి ఉండాలని, సిద్దాంతం పట్ల అవగాహన ఉంటే యూదం చేతిలో ఉన్నట్లేనని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ శిక్షణా తరగతులలో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను యుగల్ రాయలు బోధించారు. ఈ సందర్బంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఈ దేశంలో చారిత్రక కర్తవ్యాన్ని నెరవేర్చిందని 1920లో భారతదేశంలో ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర్య పోరాటంలోనూ, స్వాతంత్ర్య అనంతరం అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించి అట్టడుగు వర్గాలకు అండగా నిలిచిందన్నారు. కార్మికులు, రైతులు, యువజన, మహిళల కోసం నిర్దిష్టమైన ఆలోచనతో ముందుకు సాగిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీయేనన్నారు. 1943 మే 23న భారత కమ్యూనిస్టు పార్టీ తొలి మహాసభ ముంబాయిలో జరిగిందన్నారు. 1943 లోనే సిపిఐ మహాసభ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పిలుపు నిచ్చిందన్నారు. ఖయ్యూంతో పాటు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నిర్వహించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. దేశ విభజనను కమ్యూనిస్టు వ్యతిరేకించిందన్నారు. దేశంలో బిజెపి లాంటి మతోన్మాద శక్తుల పెరుగుదల తర్వాత దేశంలోని కమ్యూనిస్టు వ్యతిరేక మేధావులు, ప్రజలు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తిస్తున్నారన్నారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా కమ్యూనిస్టు కార్యకర్తలు మరింత సంఘటితమై ప్రజా ఉద్యమాలను నిర్మించి ముందుకు సాగాలని యుగల్ రాయలు కోరారు.

**ప్రమాదపు అంచుకు చేర్చిన మతం : ప్రొ॥ కాశీం**

భారతదేశంలో మతం సమాజాన్ని ప్రమాదపు అంచుల్లోకి చేర్చిందని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు ప్రొ॥ కాశీం తెలిపారు. మతం కులం రాజకీయ రంగును పులముకుంటే ప్రమాదకరమని ఆయన తెలిపారు. సిపిఐ రాజకీయ శిక్షణా తరగతులలో భాగంగా కులం, మతం వర్గ పోరాటాలు అనే అంశాన్ని కాశీం బోధించారు. ప్రస్తుతం వర్గపోరాట సూత్రీకరణ మారుతుందని కాశీం తెలిపారు. మతం ఇప్పుడు రాజకీయ ఆయుధంగా మారిందన్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు నూతన సవాళ్లు పార్టీ నిర్మాణం అనే అంశాన్ని బోధించారు. ఈ శిక్షణా శిబిరంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పాల్గొనగా ప్రిన్సిపాల్‌గా జమ్ముల జితేందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్‌గా శింగు నర్సింహారావు లు వ్యవహరించారు.

**(మొదటిపేజీ తరువాయి)**

సాంఘీక సమానత్వం, సాంస్కృతిక జీవవైవిద్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కమ్యూనిస్టులమైన మనపై ఉందన్నారు. శతాబ్ధపు విప్లవోధ్యమంలో అనేక ఎత్తు పల్లాలలను కమ్యూనిస్టు పార్టీ చవి చూసిందని, ఆ నాటి నుండి నేటి వరకు పీడిత తాడిత ప్రజలకు అండగా ఎర్ర జెండా నిరంతరం ఎగురుతూనే ఉందన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా, పదవులు ఉన్నా లేకపోయినా ప్రజలను ఏకం చేసి ప్రభుత్వాల ధ్వందనీతిని ఎండగడుతూ ముందుకు సాగడమే కమ్యూనిస్టు నిజమై సిద్ధాంతం అన్నారు. మతం, కులం, వర్గ, వర్ణ పేరుతో భారతదేశ సామాజిక వ్యవస్థ గతి తప్పిందని, దానిని గాడిలో పెట్టి సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు పనిచేయాలన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజలపై పెత్తనం చెలాయిస్తోందని, వ్యక్తి పూజ పెరిగిందని, సిద్ధాంతాలను ప్రక్కనబెట్టి స్వార్ధపూరిత రాజకీయ వ్యవస్థను తయారు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితులను శాస్త్రీయపద్దతుల్లో ఎదుర్కోవాలని, ఇందుకోసం కమ్యూనిస్టులు అనునిత్యం ప్రజల్లో ఉంటూ వారిని చైతన్య పర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో మతం పేరిట రాజకీయ రాజ్యం ఏర్పడిందని, మతోన్మాదులు చేతుల్లో భారతదేశం కీలుబొమ్మగా మారి పోయిందని, ప్రజా శ్రేయస్సు, మౌళిక వనరుల కల్పన కంటే గుళ్లు గోపురాలకు ప్రాధాన్యత ఇస్తు ప్రజల మెదళ్లను కాషాయమయం చేస్తున్నారని, అదికాదని వాదించిన వారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ మానప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాజకీయ శిక్షణా తరగతుల ద్వారా చైతన్యవంతులై పురోగమించాలన్నారు.

**సామాజిక విషభావాజాలం నుండి దేశాన్ని కాపాడుకోవాలి : ప్రొ.ఖాసీం**

విషభావాజాలాన్ని సమాజంలో చొప్పిస్తున్నారని, దానిని దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రొఫెసర్ ఖాసీం అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు ఆయన మొదటి రోజు వక్తగా హాజరై కులంమతం,వర్గపోరాటం అనే అంశంపై మాట్లాడారు. పాశ్చ్యాత్య దేశాల్లో ఎక్కడా కులం,మతం వ్యవస్థ కనిపించదని, కేవలం ఒక్క భారతం దేశంలోనే ఈ దుస్థితి ఉందన్నారు. అక్కడ మనుష్యులంతే సమానమే అని, కానీ ఇక్కడ కులం, మతం, వర్గం, వర్ణం అంటూ తప్పుడు పద్దతులను బలవంతంగా రుద్ది కొందరు స్వార్ధపూరిత మతవాదులు పబ్బం గడుపుకుంటున్నారని చెప్పారు. అనంతరం సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు నూతన సవాళ్లు పార్టీ నిర్మాణంపై మాట్లాడారు. నూతన లేబర్ కోడ్‌లపై ఎం.డీ.యూసఫ్, భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రపై ప్రొ. యుగల్ రాయలు మాట్లాడారు. నరాటిప్రసాద్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన తొలిరోజు శిక్షణా తరగతుల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, రాష్ట్రకార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, రాష్ట్రసమితి సభ్యులు ముత్యాల విశ్వనాధం, మున్నా లక్ష్మి కుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి బ్రహ్మం, సరెడ్డి పుల్లారెడ్డి, ఎస్‌డి సలీం, చంద్రగిరి శ్రీనివాసరావు, కమటం వెంకటేశ్వరరావు, చలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, చంద్ర నరేంద్రకుమార్, దేవరకొండ శంకర్, మండల, పట్టణ కార్యదర్శులు వీశంశెట్టి పూర్ణచంద్రరావు, అడుమిల్లి సాయిబాబా, గుండెపిన్ని వెంకటేశ్వరరావు, భుక్యా ధస్రు, డి సుధాకర్, పద్మానాభరాజు, గుగులోత్ రామచందర్, బంధం నాగయ్య, బొర్రా కేశవులు, జి.రామకృష్ణ, ఉయికే నారాయణ, ఎండి యూసఫ్, పి సతీష్, ధర్మ, వాగబోయిన రమేష్, అనంతనేని సురేష్, మువ్వ వెంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# మహాసభలలో భవిష్యత్ కార్యాచరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (టియుడబ్ల్యూజె) తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలు పోరాటాల పురిటి గడ్డ ఖమ్మంలో జరగనున్నాయని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నగుగూరి శేఖర్, విరహత్ అలీ తెలిపారు. రాష్ట్ర మహాసభల ఏర్పాట్ల పరిశీలన కోసం ఖమ్మం వచ్చిన సందర్బంగా శుక్రవారం డిపిఆర్‌సిలో జరిగిన మీడియా సమావేశంలో నగునూరి శేఖర్, విరహత్ మాట్లాడుతూ ఖమ్మం ఎన్నో ప్రజా ఉద్యమాలకు దన్నుగా నిలిచిందని రాష్ట్ర విభజనకు ముందు ఖమ్మంజిల్లాలో రెండుసార్లు రాష్ట్ర మహాసభలు జరిగాయని వారు తెలిపారు. మహాసభలు ఖమ్మంలో జరగనుండడం యూనియన్‌లో ఒక నూతన ఉత్తేజాన్ని తీసుకురానుందన్నారు. ఈనెల 19, 20 తేదీలలో జరిగే ప్రతినిధుల మహాసభలో జర్నలిస్టుల సమస్యలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశించుకోనున్నామని వారు తెలిపారు. మొత్తం మహాసభలలో 12 తీర్మానాలను ఆమోదించనున్నామని ఇదే సందర్బంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) ఉద్యమచరిత్రను తెలియజేస్తూ ఒక పాటల సిడిని కూడా విడుదల చేయనున్నట్లు వారు తెలిపారు. జర్నలిస్టు ఉద్యమానికి సుదీర్ఘ కాలం సేవలు అందించిన దివంగత యూనియన్ నేత అమర్‌నాథ్ ప్రాంగణంలో ఈ మహాసభలు జరుగుతాయన్నారు. మహాసభలను రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారని ముఖ్య అతిథిగా తుమ్మలనాగేశ్వరరావు, విశిష్ట అతిథిగా మీడియా అకాడమీ ఛైర్మన్ ఐజెయు అధ్యక్షులు కె. శ్రీనివాస రెడ్డి, అతిథులుగా బల్విందర్ సింగ్ జమ్ము, ఎస్ఎన్ సిన్హా, దేవులపల్లి అమర్, రేణుకాచౌదరి, వద్దిరాజు రవిచంద్ర, ఎంపి రఘురాంరెడ్డి లతో పాటు జిల్లాకు చెందిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు,సిపిఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు హాజరు కానున్నారని వారు తెలిపారు. ముగింపు సభకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క హాజరు కానున్నట్లు శేఖర్, విరహత్ తెలిపారు.



**లోగోను ఆవిష్కరించిన నాయకులు...**

మహాసభలను పురస్కరించుకుని యూనియన్ లోగోను రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నగుగూరి శేఖర్, విరహత్ అలీ ఆవిష్కరించారు. అంతకు ముందు మహాసభ ప్రాంగణం ఉషాహరి కన్వెన్షన్ హాల్‌ను వారు పరిశీలించారు. ప్రతినిధుల నమోదు, వసతులు, మీటింగ్ హాల్‌ను సందర్శించి స్థానిక నేతలకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు అమరవాది రవీందర్ శేషు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు నర్వనేని వెంకట్రావు, ఎస్‌డి ఖదీర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, జిల్లా నాయకులు నలజాల వెంకట్రావు, నగర అధ్యక్ష, కార్యదర్శులు మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు శివానంద, మోహినుద్దీన్, నామ పురుషోత్తం, జనార్ధనాచారి, ఏలూరి వేణుగోపాల్, మేడి రమేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయండి

**జిల్లా కలెక్టర్ విపి గౌతమ్**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో చేపట్టిన రైల్వే, జాతీయ రహదారులు, నీటి పారుదల ప్రాజెక్టుల భూ సేకరణ పురోగతిపై అధికారులతో కలెక్టర్ విపి గౌతమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టులకు సంబంధించి వాస్తవ అవసరం మేరకు భూసేకరణ చేపట్టాలన్నారు. మూడో రైల్వేలైన్‌కు సంబంధించి జిల్లాలో 59.17 హెక్టార్ల భూసేకరణ జరపాల్సి ఉండగా 54.28 హెక్టార్లకు అవార్డ్ పాస్ చేసి భూమిని స్వాధీనం చేసుకుని రైల్వేలకు అప్పగించినట్లు తెలిపారు. మిగిలిన 4.11 హెక్టార్లకు గాను చర్యలు వేగవంతం చేసి మూడో రైల్వేలైన్ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. డోర్నకల్ జంక్షన్, భద్రాచలం రోడ్డు జంక్షన్ల మధ్య రైల్వే డబ్లింగ్ లైన్ ప్రాజెక్టుకు సంబంధించి సింగరేణి మండలం కమలాపురం, పోచారం, సింగరేణి, కారేపల్లి, కోమట్లగూడెం, రేలకాయలపల్లి గ్రామాల్లో 57.045 ఎకరాల భూ సేకరణకు గాను జెఎంఎస్ సర్వే ప్రక్రియ చేపట్టి, పిఎన్ పబ్లిష్ చేయాలన్నారు. రఘునాథపాలెం మండలం పాపటపల్లి, చింతకాని మండలం బస్వాపురం, నాగులవంచ, పాతర్లపాడు, ఎర్రుపాలెం మండలం ఎర్రుపాలెం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి రైల్వేలకు అప్పగించాలన్నారు. ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే ప్యాకేజీ 1 కొరకు జిల్లాలో 548.08 ఎకరాల భూసేకరణకు గాను 507.2925 ఎకరాలకు అవార్డ్ పాస్ కాగా రూ. 144.84 కోట్లు భూమి కోల్పోయిన రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇంకా 40.1875 ఎకరాలకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇదే ప్రాజెక్టు ప్యాకేజీ 2 కింద 424.19 ఎకరాలు భూసేకరణ అవసరం కాగా 407.0450 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి ఇప్పటి వరకు రూ. 98.34 కోట్లు పరిహారం చెల్లించినట్లు తెలిపారు. ఇంకా 17.1450 ఎకరాల భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే ప్యాకేజీ 3 కింద 383.3325 ఎకరాల భూసేకరణకు గాను 371.1200 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి రైతుల ఖాతాల్లో రూ. 88.94 కోట్ల పరిహారం జమ చేశామన్నారు. మిగిలిన 12.2125 ఎకరాల భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు (పాలేరు లింక్ కెనాల్) కింద ఏన్కూరు, కామేపల్లి, సింగరేణి, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో 17.34 ఎకరాల భూ సేకరణకు గాను 1569.39 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి ఇప్పటి వరకు భూ పరిహారం కింద రూ. 93.39 కోట్లు, నిర్మాణాల పరిహారం కింద రూ. 7.30 కోట్లు విడుదలైనట్లు ఆయన తెలిపారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు (సత్తుపల్లి ట్రంక్ కెనాల్ ) క్రింద 330.15 ఎకరాల భూసేకరణకు గాను 325.30 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి రూ. 19.50 కోట్ల పరిహారం క్రింద ఇప్పటి వరకు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఏన్కూరు వద్ద 18 ఎల్ కెనాల్, బుగ్గవాగు ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలన్నారు.మున్నేరు రిటైనింగ్ వాల్ కొరకు 190.16 ఎకరాల భూసేకరణ ప్రక్రియ క్షేత్రస్థాయి తనిఖీలు చేసి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్, ఇండస్ట్రీ, రోడ్ల విస్తరణ, ఆర్‌యుబి గోడౌన్ల నిర్మాణం , సింగరేణి కాలరీస్ కంపెనీకి సంబంధించిన జెవిఆర్ ఓసిపి, కిష్టారం ఓసిపి ప్రాజెక్టులకు కావాల్సిన భూ సేకరణ పనుల్లో వేగం పెంచి జాయింట్ సర్వేలు పూర్తి చేసి ప్రక్రియ త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుల పూర్తితో రవాణా సాగు నీటి వ్యవస్థ బలపడి జిల్లా అభివృద్ధి పదంలో పయనిస్తుందని అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ కోరారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఆర్డివోలు జి. గణేష్, ఎల్. రాజేందర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, మైనింగ్ ఏడి సాయినాథ్, జాతీయ రహదారుల, రోడ్లు, భవనాల, ఇరిగేషన్, మున్సిపల్, రైల్వే శాఖల అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మి రవికి ఉత్తమ రక్తదాత అవార్డు

**-52 సార్లు రక్తదానం**
**-మంత్రి పొన్నం చేతుల మీదుగా అవార్డు అందజేత**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం మండలం సుద్దవాగు తండాకు చెందిన ఆర్మి రవి (బానోత్ రవి) కి ఉత్తమ రక్తదాత అవార్డును ప్రదానం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ సంస్కృతి ఆడిటోరియంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఆమోదిత ఉత్తమ రక్తదాత అవార్డును ఆర్మి రవికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌రావు చేతుల మీదుగా అందజేశారు. అవార్డు తో పాటు షీల్డ్ అందజేశారు. జూన్ 14న ఆర్మి రవి పుట్టిన రోజు కావడంతో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. 52 సార్లు రక్తదానం చేసిన ఆర్మి రవిని మంత్రి పొన్నం ప్రభాకర్ రావు తో పాటు రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు అభినందించారు. ఈ సందర్భంగా ఆర్మి రవి మాట్లాడుతూ 52 సార్లు రక్తదానంచేయడం ఆనందంగా ఉందని తెలిపారు. అత్యవసరంగా చికిత్స పొందుతున్న వారికి రక్తదానం చేసి వారికి నా వంతుగా సహాయపడ్డానన్న సంతృప్తి ఉందన్నారు. ఆర్మి యూత్ ఆర్గనైజేషన్ పేరుతో ఎన్నో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి తలసేమియా చిన్నారులకు రక్తదానం అందించామన్నారు. భవిష్యత్తులో మరిన్ని రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తదానం చేయాలన్నదే తన కోరిక అన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపి సురేష్ షట్కార్, మానుకొండూరు ఎంఎల్ఏ సత్యనారాయణ, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్‌వి కర్ణన్, గవర్నర్ కార్యాలయ ముఖ్య కార్యదర్శి అజయ్ మిశ్రా, రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మంజిల్లా ఛైర్మన్ చంద్రమోహన్, ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఇంచార్జి డాక్టర్ బాలు, తిరుమలాయపాలెం మండల బిఆర్ఎస్ అధ్యక్షులు భాషబోయిన వీరన్న, బోడా మంచానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో యువకుని మృతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గుండెపోటుతో యువకుడు మృతి చెందిన సంఘటన రఘునాథపాలెం మండలంలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... వి. వెంకటాయపాలెం జగ్యాతండాకు చెందిన బోడా నాగేశ్వరరావు (36) యంటెక్ పూర్తి చేశాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేశాడు. ఆ తర్వాత నాగార్జున సాగర్‌లో కొంత కాలం పనిచేసి ఖమ్మం వచ్చాడు. గత కొంత కాలం రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం నాగేశ్వరరావు లేచి కాలకృత్యాలు తీర్చుకుని ద్విచక్ర వాహనంపై టీ తాగేందుకు గ్రామంలోని వైరా రోడ్డు ప్రధాన రహదారి వద్ద ఉన్న హోటల్‌కు వస్తూ ఒక్కసారిగా ద్విచక్ర వాహనంపై నుండి కిందపడిపోయాడు. నోట్లో నుంచి నురగలు రావడంతో వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గ్రామంలో అందరితో కలివిడిగా తిరుగుతూ మాట్లాడే నాగేశ్వరరావు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నాగేశ్వరరావు మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య ఉమ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# జలాంజనేయ స్వామి ఆలయంలో మంత్రి తుమ్మల పూజలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరం వైరా రోడ్డులోని జలాంజనేయ స్వామి ఆలయ రజతోత్సవ వేడుకల్లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆలయంలో నిర్వహిస్తున్న రజతోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆలయ పూజారులు స్వాగతం పలికారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సాధు రమేష్‌రెడ్డి, కమర్తపు మురళి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాక్షేత్ర స్కూల్‌ను సందర్శించిన తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని గొల్లగూడెం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యాక్షేత్ర స్కూల్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విద్యాక్షేత్ర స్కూల్‌ను సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నాణ్యమైన విద్య బోధన అందించి తల్లిదండ్రుల మన్ననలు పొందాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు కమర్తపు మురళి, కర్నాటి కృష్ణ, రఘునాథపాలెం జెడ్పిటిసి మాలోత్ ప్రియాంక, నాయకులు సాధురమేష్‌రెడ్డి, రావూరి సైదబాబు, మిక్కిలినేని నరేంద్ర, పాలెపు వెంకట రమణ, కమటం రామకృష్ణ, అబ్దుల్ రషీద్, మేదరమెట్ల స్వరూపరాణి, స్కూల్ నిర్వహకులు, స్థానికులు పాల్గొన్నారు.

# సోమనాదంను పరామర్శించిన తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కల్లూరి సోమనాదం ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కల్లూరి సోమనాదంను శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు త్రీటౌన్‌లోని వారి ఇంటి వద్ద పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# విద్యుత్ మరమ్మతులను వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలో విద్యుత్ మరమ్మత పనులు శర వేగంగా పూర్తి చేయాలని విద్యుత్ సంస్థ డీఈఈ చింతమల్ల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని బుద్ధారంలో ఇటీవల ఈదురు గాలులు, వర్షాలకు స్థంబాలు విరిగిపోయి, తీగలు తెగటంతో మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...విద్యుత్ వినియోగదారులకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల సమయంలో వినియోగదారులు సహకరించాలని కోరారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరూ గృహజ్యోతి పథకం కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్యుత్ ను అందించేందుకు సంస్థ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి ఏడీఈ బీ.కోట్యానాయక్, నేలకొండపల్లి ఏఈ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్ స్థలం టెండర్‌ను నిలిపివేయాలి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక బస్టాండ్ స్థలం ను లీజ్ కు ఇచ్చే టెండర్లను వెంటనే నిలిపివేయాలని ఇఫ్టూ ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు. మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో ఆయన మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం కోసం దాతలు ఇచ్చిన స్థలం ను ఆర్‌టీసీ అధికారులు లీజ్ కు ఇవ్వటం సరికాదని అన్నారు. బస్టాండ్ లో కనీస సౌకర్యాలు కల్పించలేని అధికారులు స్థలాలను మాత్రం లీజ్ కు ఇవ్వటం ఎంత వరకు న్యాయం అన్నారు. బస్టాండ్ లేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ స్థలం ను ప్రజల సౌకర్యార్థం ఉంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



ప్రజాపక్షం/కరకగూడెం: మండల పరిధిలోని చిలకలగుంపు గ్రామ మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఖమ్మం శ్రీ సిటి కి చెందిన ప్రముఖ ధన్వంతరి ఆయుర్వేద హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కళశెత్తి వెంకటేశ్వర్లు భవానీ దంపతుల సహకారంతో చిలకలగుంపు పాఠశాల ఉపాధ్యాయులు కె. సూర్యనారాయణ, బావ్ సింగ్ విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి ఐదు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు డాక్టర్ దంపతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పశువులకు నిలయంగా పేరువంచ పంచాయతీ కార్యాలయం..!



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండలం పేరువంచ గ్రామపంచాయతీ కార్యాలయం పశువులకు నిలయంగా మారింది. పంచాయతీ కార్యాలయంకు అవసరాల నిమిత్తం రావాలన్నా, పోవాలన్నా వాటి వలన ఇబ్బందికరంగా ఉందని గ్రామపంచాయతీ ప్రజలు తెలుపుతున్నారు. నిత్యం ఇచ్చటనే ఉండి చెట్ల కింద ఆహ్లాదకరంగా ఉంటూ అక్కడే గడుపుతున్నాయి. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవట్లేదు అని, పశువుల వ్యర్థాలు కూడా అచ్చటనే ఉండటంవల్ల శుభ్రం చేయకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఎంపీడీవో, ఎంపీఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శిని కోరుతున్నారు.

## గంజాయి స్వాధీనం



ప్రజాపక్షం/ములకలపల్లి: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచి గంజాయిని పోలీసులు పట్టుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈవిషయంపై ఎస్ఐ రాజమౌళి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ములకలపల్లి మండలంలో రింగిరెడ్డిపల్లి గ్రామంలో ఓ వ్యక్తి అక్రమంగా ఇంట్లో నిషేధిత గంజాయి నిల్వ చేశారనే పక్క సమాచారం తన సిబ్బందితో దాడి చేసి నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. సుమారు 5కేజీల 800 గ్రాముల గంజాయి స్వాధీన చేసుకున్నామని తెలిపారు.

## ఉచితంగా సప్లై చేయాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: రైతులకు ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నాణ్యామైనవి ఉచితంగా సప్లై చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్కే కుమార్ అన్నారు. శుక్రవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ములకలపల్లి మండల కమిటీ సమావేశం చవల ఆదినారాయణ అధ్యక్షతన నర్సింగపురంలో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, కల్తీ ఎరువులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈప్రాంతంలో పత్తి , వరి, మిర్చి పంటలను రైతులు పడిస్తారని ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికట్టాలని, మంచి విత్తనాలను రైతులకు సొసైటీల ద్వారా ప్రభుత్వ కార్యాలయాల ద్వారా విత్తనాలు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు కుంజా క్రిష్ణ, ఆదినారాయణ, కొండపునేని సత్యనారాయణ, వంక సురేష్, దుబ్బ వెంకటేశ్వర్లు, ముదిగొండ మల్లన్న, బతుల నాగరాజు, మడివి చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న జాతర



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలంలోని నరసాపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ కోటమ్మ అమ్మవారి 18వ వార్షికోత్సవ నేటితో ముగియనున్నది. గురువారం రోజున అభిషేకాలను ఘనంగా భక్తులు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

# సమాజ చైతన్యంతోనే మార్పు

**-సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్**
**-సిపిఐ శిక్షణా తరగతులు ప్రారంభం**

ప్రజాపక్షం/ ఖమ్మం : సమాజ చైతన్యంతోనే మార్పు జరుగుతుందని సమిష్టి ప్రయోజనాలు చేకూర్చే మార్పు దిశగా ఆలోచన చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయాలను ధనం శాసిస్తుందని ఆయన తెలిపారు. అందుకే రాజకీయాలలో నిస్వార్థపరులు, సమాజ హితాన్ని కోరుకునే వ్యక్తులకు, పార్టీలకు సరైన ఆదరణ లభించడం లేదన్నారు.సిపిఐ కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగే రాజకీయ సైద్దాంతిక శిక్షణా తరగతుల ప్రారంభ సందర్భంగా శుక్రవారం అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మతం, కులం, ధనం ఎన్నికల్లో ప్రభావితం చేస్తున్నాయని కుల మతాలకతీతంగా అట్టడుగు వర్గాల ప్రయోజనాలను ఆశిస్తూ రాజకీయ వ్యవస్థ నిర్మితం కావాలని ప్రసాద్ తెలిపారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బిజెపికి గుణపాఠం చెప్పారని లౌకిక శక్తులను కాపాడుకున్నాయని ప్రసాద్ తెలిపారు. వివిధ రకాల పరిస్థితులు సమాజం పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వీటిని అదిగమిస్తూ అత్యంత అభివృద్ధి చెందిన చైతన్యవంతమైన సమాజ నిర్మాణం కోసం కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలలో రాజకీయ సైద్దాంతిక అవగాహన కలిగించాలన్నారు. సిద్దాంతం అవగాహన,



సమాజం పట్ల సరైన ఆలోచన ఉంటే సమస్యల పరిష్కారానికి సులభతరం అవుతుందన్నారు. మతం ప్రధాన భూమిక పోషిస్తున్న ప్రస్తుత తరుణంలో కమ్యూనిస్టులు మాత్రమే దశ, దిశా నిర్దేశించనున్నదన్నారు. ఈ రాజకీయ శిక్షణా తరగతులలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహాలక్ష్మి , తోట రామాంజనేయులు, జాగర్లముడి రంజిత్‌కుమార్, పగడాల మల్లేష్, దండు ఆదినారాయణ, మందడపు రాణి, బెజవాడ రవి, ఏపూరి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం

ప్రజాపక్షం/బూర్గంపాడు: మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సారపాక గ్రామానికి చెందిన ముత్యాలమ్మ పేటకు చెందిన మందపాటి వెంకటరెడ్డికి రూ 8వేల ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ బత్తుల రామకొండారెడ్డి మాట్లాడుతూ మందపాటి వెంకటరెడ్డి ఓ దినపత్రికలో విలేఖరిగా పని చేస్తున్నాడు. గత 10రోజుల క్రితం షుగర్ లెవెల్స్ పూర్తిగా పెరిగిపోయి తీవ్ర అనారోగ్యంతో ఉండగా హాస్పిటల్‌కి వెళ్ళారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి గుండె, యూరిక్ యాసిడ్ సమస్య ఉందని చెప్పడం జరిగిందన్నారు. చిన్నతనంలో కుడి కాలుకి పోలియే రావడంతో కుటుంబంకు ఆసరాగా వుండాలని జర్నలిజంపై వున్న మక్కువతో ప్రతిక విలేఖరిగా పని చేస్తూ కుటుంబాని తనవంతుగా సహాయంగా ఉంటున్నట్లు తెలిపారు. వెంకటరెడ్డి అనారోగ్యం కారణంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిసి సహాయం చేయడం మా



నేస్తం ట్రస్ట్ బాధ్యతగా భావించి తమ వంతుగా చిన్న ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ వైస్ ఛైర్మన్ చింత అంకిరెడ్డి, సభ్యులు సొసైటీ డైరెక్టర్ బత్తుల రామకొండారెడ్డి, సంకా సురేష్, డి బాలనారాయణరెడ్డి, ఆవుల నాగార్జున పాల్గొన్నారు.

# దత్తత గ్రామాలుగా గుర్తించాలి

ప్రజాపక్షం/బూర్గంపాడు: పాల్వంచ మండలంలోని కేటీపీఎస్ కర్మాగారం నుండి జల, వాయు కాలుష్యం తీవ్రస్థాయిలో వెలువడుతుండటంతో ప్రజలు అనారోగ్యానికి గురౌతున్నారని బిజెవైం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ వెంకట్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కర్మాగారం నుండి వెలువడుతున్న బూడిద నీళ్లు తాగి పశువులు సైతం అనారోగ్య బారిన పడుతున్నారని తెలిపారు. రైతు వ్యవసాయ అవసరాల కోసం ఆ బూడిద నీళ్లను వాడటంతో సరైన దిగుబడి రాక నష్టపోతున్నారని, దీనికి కారణమైన కేటీపీఎస్ నుండి వెలువదుతున్న కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు యాజమాన్యాలు మాత్రం చేపట్టడం లేదన్నారు. కనీసం తాత్కాలిక చర్యలు కూడా తీసుకోవడం లేదని బాధిత గ్రామాల ప్రజలు మాటలను పట్టించుకోవడం లేదన్నారు. జల, వాయు కాలుష్యాన్ని కంట్రోల్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బూర్గంపాడు మండలంలో పినపాకపట్టినగర్, ఉప్పుసాక,



సోంపల్లి, బూర్గంపాడు గ్రామాలను కేటీపీఎస్ పొల్యూషన్ ప్రభావిత గ్రామాలుగా గుర్తించి దత్తత గ్రామాలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ప్రజాపక్షం/చంద్రుగొండ : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని లేనిచో చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి సత్తెనపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో పలు పాఠశాలలను సందర్శించారు. పాకలగూడెం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని వాటిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ



ఛైర్మన్ తులసమ్మ, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, రామకృష్ణ, ప్రసాద్, సిఆర్‌పి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కమిటీల జాడేది..!






**-సమావేశాలు లేక వసతులు లోపం**
**-రెండేళ్లుగా కమిటీ సమావేశం లేకపాయే..**
**-పీహెచ్‌సీ కమిటీలకు ఈ నెలలోనే ముగియనున్న పదవీకాలం**

ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రభుత్వ హాస్పిటల్ లో మౌళిక వసతులు కల్పన కోసం ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి కమిటి (హెచ్‌డీసీ) లు ఉత్సవ విగ్రహాలు గా మారాయి. జిల్లా ఆసుప్రతులకు జడ్పీ ఛైర్మన్‌లు, సీహెచ్‌సీ లకు స్థానిక ఎమ్మెల్యేలు, పీహెచ్‌సీ కి ఎంపీపీలు ఛైర్మన్ లుగా ఉన్నారు. అభివృద్ధి కమిటీ లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో పాటు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు కూడ సభ్యులు గా ఉంటారు. జడ్పీ ఛైర్మన్‌లు, ఎంపీపీ ల పదవీ కాలం ఈ నెలలోనే ముగియనున్నది. ఆరు నెలలు గా శాసనసభ, లోక్‌సభ, శాసనమండలి ఎన్నికలకు ఎన్నికల కోడ్ అమలు లో ఉంది. ఈ నేపథ్యంలో హెచ్‌డీసీ సమావేశాలు నిర్వహించలేదు. కానీ నేలకొండపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం కు గత రెండేళ్ల నుంచి కమిటీ సమావేశాలను జరిపిన పాపానా పోలేదు. ఇది ఇలా ఉండగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గా ఉన్న హాస్పిటల్ ను అప్‌గ్రేడ్ గా చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా మార్చారు. అప్పటి నుంచి పేరు మారింది కానీ , నిధులు మాత్రం పైసా విదల్చలేదు. దీంతో కమిటీలు కూడ ఉత్సవ విగ్రహాలు గా ఉన్నాయి.

**నిధులు లేవని నిస్తేజం...**

ప్రభుత్వం హాస్పిటల్ లకు ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు మంజూరు కాలేదని దీంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదని వైద్యాధికారులు కమిటీ ఛైర్మన్‌లు చెబుతున్నారు. ప్రతీ మూడు నెలలకొకసారి సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. కానీ ఎలాగూ నిధులు రావటం లేదు. ఇక సమావేశాలు ఎందుకు అనుకున్నారో ఏమో కానీ సమావేశాలు మాటే లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కు ఆయా మండల పరిషత్ అధ్యక్షులు ఛైర్మన్ లు గా ఉంటారు. నిధులు లేకపోవటంతో సమావేశాలు కేవలం రికార్డులకు మాత్రమే పరిమితమైందనే విమర్శలు వినవస్తున్నాయి. ఉన్న కొద్ది పాటి నిధులను ఖర్చు చేయాలంటే వైద్యాధికారులు ఆందోళన చెందుతున్నారు. కమిటి సమావేశాలు నిర్వహించకుండా ఎలా ఖర్చు చేయాలనే ఆలోచన లో పడ్డారు. కమిటి అమోదం ఉంటేనే నిధులు డ్రా చేయాల్సి ఉంటుంది. జిల్లాలో చాలా చోట్ల కమిటీల ఉసే వినపడటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హాస్పిటల్ కమిటీలను ఏర్పాటు చేసి నెలకొన్న సమస్యల పరిష్కారం కోరకు నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



**ప్రజా ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధి లేదు : రావెళ్ల కృష్ణారావు, మోటాపురం.**

రెండేళ్ల గా హాస్పిటల్ కమిటి సమావేశాలు నిర్వహించటం లేదంటే అధికారులకు ప్రజారోగ్యం పట్ల ఎంత శ్రద్ధ ఉందో అర్ధం చేసుకోవచ్చు. ప్రతీ మూడు నెలలకొకసారి జరగాల్సిన సమావేశాలు నిర్వహించకుండా మమ అనిపిస్తున్నారు. దీని వలన ప్రజలకు మేలు జరగదని పేర్కోన్నారు.



**నిధులు లేనప్పుడు కమిటీలు ఎందుకు : పసుమర్తి శ్రీనివాస్, నేలకొండపల్లి**

ప్రభుత్వ హాస్పిటల్స్ కు నిధులు మంజూరు చేయనప్పుడు కమిటీలు మాత్రం ఎందుకు. ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి,కమిటిలకు బాధ్యతలు అప్పగిస్తే చాలా వరకు ఉపయోగం ఉంటుంది. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి.



**ప్రత్యేక దృష్టి సారించాలి : గండు సతీష్, అమ్మగూడెం, మాజీ సర్పంచ్.**

ప్రభుత్వ హాస్పిటల్స్ పట్ల అధికారులు, పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలంటే కమిటీలకు పూర్తి బాధ్యతలు అప్పగించి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం దీని పై దృష్టి సారించాలి.

## విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/దమ్మపేట: దమ్మపేట మండలం చలమప్పగూడెం గ్రామంలో శుక్రవారం స్థానిక శాసనసభ్యులు జారె ఆదినారాయణ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం తో పాటు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం బాలబాలికల చేత ఓనమాలు దిద్దించారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, యూనిఫామ్, విద్యార్థులకు అందించారు. అనంతరం ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలోని పాఠశాలల అభివృద్ధికి విద్యారంగానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నానని, ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా అనేక పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించానని తెలుపుతూ, చదువుకునే వయసు వచ్చిన ప్రతి విద్యార్థినీ విద్యార్థులను పాఠశాలకు తీసుకొచ్చే బాధ్యత ఉపాధ్యాయులదేనని, పాఠశాలల మౌలిక వసతుల కల్పనలో ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రతి సమస్యను పరిష్కరిస్తానని ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు పాఠాలు బోధించే విషయంలో అలసత్వం లేకుండా పనిచేయాలని ఈ విధ్యాసంవత్సరంలో2024 2025 నియోజకవర్గ వ్యాప్తంగా ఉత్తమ ఫలితాలు రాబట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు దమ్మపేట మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మీడియా మిత్రులు, కాంగ్రెస్ పార్టీ మండల, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే కూనంనేని జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/దమ్మపేట: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జన్మదిన వేడుకలు శుక్రవారం దమ్మపేట మండల కేంద్రంలో సిపిఐ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సిపిఐ మండల సహయ కార్యదర్శి యార్లగడ్డ మణికంఠ మాట్లాడుతూ కూనంనేని సాంబశివరావు జన్మదిన వేడుకలు మండలంలో నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉంది అని ఆయన ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలి అని మనమందరం కూడా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ సిద్ధాంతాలు కట్టుబడి ఉండాలి అని అన్నారు. పార్టీలో విద్యార్థి నాయకుడు నుండి ఈరోజు ఎమ్మెల్యే గా ఎదిగారు అంటే ఆయన ఏ విధంగా ప్రజల కోసం పోరాడారో ఆ పోరాట స్పూర్తితో మన మందరం కూడా పార్టీ కోసం ప్రజల కోసం పోరాడాలి అని, ఆయన జీవితం మన లాంటి సామాన్య కార్యకర్తలకు దిశానిర్దేశం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాపక్షం/భద్రాచలం : ఐటిడిఏ పరిధిలోని బాలుర డిగ్రీ మణుగూరు, మిట్టగూడెం కాలేజీల్లో ప్రమథ సం. అడ్మీషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఏ పిఓ ప్రతీక్ జైన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు ఈ నెల 17 నుండి 23వ తేది లోపు నేరుగా కళాశాలల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. 25వ తేది నుండి కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాల కోసం 7901097698,7989242996 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించండి




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ధరణి పెండింగ్ దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలని సిసిఎల్ నవీన్ మత్తల్ అన్నారు. శుక్రావరం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ కలెక్టర్లతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డా.ప్రియాంక ఆలా, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు. ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని వచ్చాయనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ధరణి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన మార్గాలపై ఆయన తగు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ వారం రోజుల్లో పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓలుమధు, దామోదర్‌రావు, డిఆర్‌ఓ రవీంధర్, అన్ని మండలాల తహాశిల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఇఫ్టూ ఏరియా నూతన కమిటీ ఎన్నిక




ప్రజాపక్షం/గుండాల : ఇఫ్టు ఏరియా నూతన కమిటి ఎన్నుకున్నట్లు ఇఫ్టు జిల్లా ప్రదాన కార్యదర్శిషేక్ యాకూబ్‌షావలి ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షులుగా గడ్డం రమేష్, కార్యదర్శిగా కొమరం శాంతయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. భారత కార్మిక సంఘాల సమైఖ్య ఇఫ్టు 2వ మహాసభలో 23 మందితో ఈ కమిటిని ఎన్నుకోవడం జరిగిందని , సహాయ కార్యదర్శిగా కల్తి ఆదినారాయణ, కోశాఇకారిగా ఎస్‌కె పాష, 5గురిని ఆఫీస్ బేరర్లుగా , 18 మందిని కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కమిటి మండల పరిదిలోని పరిదిలో ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తుందని అన్నారు. నూతనంగా ఎన్నుకున్న అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను పరిమినెంట్ చేయాలని , మోడి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసింని , కార్మికులను బానిసలుగా చేసిందని సమ్మెహక్కు లేకుండా , 8గంటల పని దినం లేకుండా వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ ను తెచ్చిందని , తెలంగాణ రాష్ట్రంలో ఈ లేబర్ కోడ్‌ను అమలు చేయోద్దని డిమాండ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేయకుండా కనీస వేతనం26వేల రూపాయలు ఇవ్వలని డిమాండ చేశారు.

## ప్రీ స్కూల్ పిల్లలకి స్కూల్ బ్యాగ్స్ పంపిణీ



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండలం పద్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలో గల వలస ఆదివాసి గ్రామం నీలాద్రిపేట అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ పిల్లలకి హైదరాబాద్ వారి సమిష్టి సహస్ర సహకారంతో ఆధార్ సంస్థ ఆధ్వర్యంలో, ఆధార్ సంస్థ డైరెక్టర్ తోలెం రమేష్ స్కూల్ బ్యాగ్స్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని, ప్రీ స్కూల్ కార్యక్రమాల ద్వారా పిల్లలో నైపుణ్యం పెరుగుతుందని, పిల్లల తల్లీదండ్రులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత, ప్రైమరీ స్కూల్ టీచర్ కుమారస్వామి, ఆధార్ సంస్థ సభ్యులు బట్ట బిక్షపతి, రాజబాబు, గ్రామ పెద్దలు సోడి మాడారం, భీమయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక అక్షరాభ్యాసం



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండల పరిధిలోని ఎంపీపీఎస్ పోలకొమ్ము తోగు పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ జి. మంజుల, ఆశ్రమ పాఠశాల పే సెంటర్ ప్రధానోపాధ్యాయుడు డి.జగన్, మాజీ సర్పంచ్ ఆయన నరసింహారావు, ఉపాధ్యాయులు ఎన్ శ్రీ లక్ష్మి , గంగరాజు, సి ఆర్.పి అండ్ విఓ స్వరూప, అంగన్‌వాడి టీచర్ తదితరులు పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాద తిరుగుబాటు విప్లవ కెరటం చేగువేర




## ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సామ్రాజ్యవాద తిరుగుబాటు విప్లవ కెరటం కామ్రేడ్ చేగువేరా అని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో గల గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో చేగువేరా 96వ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా చేగువేరా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ పలు దేశాల్లో అణిచివేత పై గెరిల్లా పోరాటాలు నిర్వహించి స్వాతంత్ర్య ఫలాలు అందించిన స్వాతంత్ర్య విప్లవ వీరుడు చేగువేరా అన్నారు. చేగువేరా ఆశయం, పోరాటం నేటికీ సజీవమైందని ఆయన త్యాగం అజరామరమన్నారు. ఎక్కడ అసమానత, అణిచివేత మొదలైన అక్కడ చేగువేరా రగిలించిన విప్లవ చైతన్యం ఎత్తిన ప్రతి పిడికిలిలో రగులుతూ జ్వలిస్తూనే ఉంటుందన్నారు. అర్జెంటీనాలో జన్మించి క్యూబా విప్లవ సాధనలో నిలిచి బోలివియా విప్లవ సాధనలో 39 ఏళ్ల వయస్సులో అమరుడైన చేగువేరా చిరస్మరణీయుడని యువతకు స్ఫూర్తి ప్రధాత అన్నారు. దోపిడీకి గురవుతున్న ప్రజలకు విప్లవాత్మక మెడిసిన్ అవసరం అని భావించి విప్లవకారుడిగా పరిణితి చెందిన గెరిల్లా దళానికి నాయకుడయ్యారన్నారు. ప్రపంచ మంత విప్లవోద్యమాన్ని నిర్మించాలన్న చేగువేరా ఆలోచనను తట్టుకోలేక అమెరికా సామ్రాజ్యవాదులు కుట్రపన్ని చేగువేరాను అంతమొందించారన్నారు. చేగువేరా స్ఫూర్తితో యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో పయనించాలని ఆయన చూపిన మార్గంలో పయనించి పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, సహాయ కార్యదర్శులు నాగులమీరా, శివ, కౌషిక్, మనోజ్, ప్రసాద్, అజయ్, గోపి, నరేష్, సాయి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డులుగా మారిన సాగర్ కాలువలు

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని డంపింగ్ యార్డులుగా స్థానిక ప్రజలు మార్చుకున్నారు. మండల పరిధిలోని వాచ్యనాయక్ తండ , జిడిపి పల్లి, బాలాజీ నగర్, ముగ్గు వెంకటాపురం, పేరువంచ తదితర గ్రామాల వారు గ్రామాలకు ఆనుకొని కాలువలు ఉండటంతో వాటిని డంపింగ్ యార్డులుగా మార్చి అక్కడనే నిప్పు పెట్టి తగలబెడుతున్నారు. కాలుష్యం వలన అనేక ప్రమాదకర వ్యాధులు వస్తాయని తెలిసి కూడా అచ్చటనే డంపింగ్ యార్డులుగా కాలువలను మార్చేసుకుంటున్నారు. అదేమని అడిగితే స్థానిక గ్రామపంచాయతీ చెత్త ట్రాక్టర్ ఇండ్ల వద్దకు రావట్లేదని దానివలన కాలవల్లోనే వేస్తున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. పంచాయతీ వారిని అడిగితే నిధులు కొరతతో మేము డీజిల్ లేక ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. దీని వలన స్థానికంగా రోడ్లు పక్కనే చెత్తాచెదారం కాలువలలో డంపింగ్ యార్డ్ లుగా మార్చుకొని ఉపయోగించుకుంటున్నారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు సమీపంలోని కాలువలు



డంపింగ్ యార్డులుగా మార్చకుండా అట్టి చెత్తను డంపింగ్ యార్డు లోనే వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక పంచాయతీ అధికారి మండల అభివృద్ధి అధికారి ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతున్నారు.

# అస్తవ్యస్తంగా స్పెషల్ ఆఫీసర్ల పాలన..!



## -సమస్యల నిలయాలుగా గ్రామాలు
## -మానిక్యారంలో అధ్వానంగా పారిశుధ్యం

**ప్రజాపక్షం/కారేపల్లిః** స్పెషల్ ఆఫీసర్ల పాలనలో గ్రామాలన్ని సమస్యల నిలయాలుగా మారాయి. స్పెషల్ ఆఫీసర్లు పంచాయతీ కార్యదర్శులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రకరకాల సమస్యలతో గ్రామాల్లోని ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్పెషల్ ఆఫీసర్లు స్థానికంగా ప్రజలకు ఎలాగూ అందుబాటులో ఉండటం లేదు. కనీసం స్థానికంగా ఉండాల్సిన పంచాయతీ కార్యదర్శులు కూడా స్థానికంగా అందుబాటులో ఉండకుండా పట్టణాల నుంచి రాకపోకలు సాగిస్తూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా పంచాయతీల్లో ప్రత్యేక పాలన సాగుతుంది. గ్రామాల్లో పారిశుధ్య సమస్య ప్రజలను ఎంతగానో వేధిస్తుంది. మాణిక్యారం గ్రామపంచాయతీలో అటు ప్రత్యేక అధికారి గ్రామ కార్యదర్శి ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. అధికారులు పట్టించుకోకపోతే ఆందోళన చేస్తామని గ్రామస్థులు వారి ఆవేదన వెళ్ళబుచ్చుతున్నారు.

# రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి చేయూతనిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయరంగానికి తెలంగాణ ప్రభుత్వంలో తొలి ప్రాధాన్యతనిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా పరిషత్ సమావేశం శుక్రవారం స్థానిక జెడ్పి మీటింగ్ హాల్‌లో జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేనివిధంగా అకాల వర్షాల వల్ల పంటలు నష్టోయిన రైతులకు ఎకరానికి రూ. 10వేల ఆర్థిక సాయం అందించేందుకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ప్రకృతికి అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలని అప్పుడే ఆశించిన దిగుబడి వస్తుందని ఆయన తెలిపారు. వ్యవసాయంలో అత్యంత ప్రాధాన్యతనివ్వాల్సిన అంశం విత్తన ఎంపిక అని సరైన విత్తనాలను ఎంపిక చేసుకున్నప్పుడే ఆశించిన దిగుబడిసాధ్యమవుతుందని లేదంటే పూర్తిగానష్టపోవాల్సి వస్తుందని తుమ్మల తెలిపారు. దళారులను ఆశ్రయించి నకిలీ విత్తనాలు కొంటే అప్పుల పాలు కాక తప్పదని హెచ్చరించారు. రైతు భరోసాకు సంబంధించి రైతు సంఘాలు,ప్రజాప్రతినిధులతో చర్చించి విధి విధానాలు రూపొందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రైతులకు రూ. 7,500 కోట్లు రైతుబంధు ద్వారా అందించడం జరిగిందన్నారు. గోదావరి జలాలను ఈ ఏడాది పంట భూములకు అందించేందుకు ప్రయత్నం జరుగుతుందని వైరా, లంకాసాగర్ ప్రాజెక్టులతో పాటు నాగార్జున సాగర్ కాలువ ద్వారా నీటిని అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. యూనిఫాం లు అందించామని ప్రభుత్వపాఠశాలల్లో సైతం ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు, జెడ్పిసిఈవో ఎస్ వినోద్, జెడ్పిటిసిలు, ఎంపిపిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో భారీ వర్షం



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం భారీ వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మధ్యాహ్నం వరకు ఎండతో అల్లాడిన ప్రజలకు వర్షంతో ఉపశమనం పొందారు. వర్షం కారణంగా డ్రైనేజీలు పొంగి పోర్లడంతో చెత్తా చెదారం రోడ్లపైకి చేరింది. వర్షంతో పాటు పెద్దెత్తున గాలివీచడంతో భద్రాచలం నుండి ఎటపాక వెళ్లే రహదారిపై వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

# మంత్రి తుమ్మలకు ఇస్కాన్ భక్తబృందం ఆహ్వానం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఇస్కాన్ బృందంవారు ఆహ్వానం పలికారు. గురువారం ఖమ్మం రూరల్ మండలంలోని బారుగూడెంపంచాయతీపరిధిలోని శ్రీసిటీలో గల ఆయన నివాసం వద్దకు చేరుకుని తమ విన్నపాన్ని కోరారు. జూలై 10వ తేదీన అంగరంగా వైభవంగా శ్రీ జన్నాథ్‌రథయాత్ర మహామహోత్సవం మధ్యాహ్నం 12గంటలకు వార్తకసంఘం(కిన్నెరసానిథియేటర్) నుండి మొదలై వైరారోడ్ మీదుగా రోటరీనగర్ రాజరాజేశ్వరి దేవస్థానం ఫంక్షన్‌హాల్ నందు 6గంటలకు ముగియనున్నది. అలాగే సాయంత్ర 6గంటల నుండి 8గంటల వరకు భజనలు, శ్రీ జగన్నాథ్‌లీల, కథ,మహారతి, మహాప్రసాదవితరణ ఉన్నట్లు ఇస్కాన్ బృందంవారు తెలిపారు.

# స్వాతంత్ర సమరయోధుడు మృతి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్వాతంత్ర సమరయోధుడు, జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొత్తా జనార్ధన్‌రావు శుక్రవారం మృతి చెందారు. ఇటీవల అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందారు. ఇటు పార్టీ పరంగా, సేవా పరంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన మృత దేహం ను నేలకొండపల్లి లో ఆయన నివాసం వద్ద రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు సందర్శించి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, కడియాల నరేష్, దోసపాటి చంద్రశేఖర్, రేగూరి హనుమంతరావు, కొత్తా రమేష్, కోత్తా సత్యనారాయణ, ఎంపీటీసీలు దోసపాటి కల్పన, రేగూరి వాసవి తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పత్తి విత్తనాలు నాటిన రైతులు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో పత్తి పంట ను సాగు చేసేందుకు విత్తనాలను నాటా రు. కల్లూరు మండల పరిధిలోని బత్తులపల్లి, లక్ష్మీపురం, చెన్నూరు, పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, తాళ్లూరు వెంకటాపురం, కప్పలబంధం, లోకవరం తదితర గ్రామాలలో దుక్కులు దున్ని సాలులు సిద్ధం చేసి విత్తనాలను నాటా రు. మండల పరిధిలోని 2800 ఎకరాలలో 1200 మంది రైతులు ఒక్కో ఎకరాకు 30000 పెట్టుబడి తో ప్రణాళికలు చేసుకొని పత్తి సాగుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలకు గాను పొలం పదును రావడంతో తడిగా ఉండటం వలన విత్తనాలు విత్తడం మండలంలో ప్రారంభించారు. పత్తి పంటకు సాగుకు గత కొద్ది రోజులుగా 2800 ఎకరాలలో మెట్ట పంటలను సాగు చేసేందుకు రైతులు మెత్తగా దున్ని సిద్ధం చేసుకొని విత్తనాలను నాటుతున్నారు. ఒక్కో రైతు ఒక్కో ఎకరానికి 30 వేలు పైగాపెట్టుబడి నగదును సిద్ధం చేసుకుని ప్రణాళిక చేపట్టారు. కల్లూరు మండల పరిధిలోని మెట్ట పంటలు సాగుకు ప్రణాళికలతో సిద్ధం చేసుకున్నారు.

# నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు



**ప్రజాపక్షం/ఏన్కూరుః** వ్యవసాయ సీజన్ ప్రారంభమై విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని సిపిఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ సూచించారు. మండలంలో కొంతమంది వ్యాపారులు అనుమతి లేని విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారని, అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. గుంటూరు నుండి అక్రమంగా తరలించి ఏన్కూరు మండలంలో వివిధ గ్రామాల్లో రైతులను మోసం చేస్తూ అధిక ధరకు విక్రయిస్తున్నారని, వారి మాయలో పడవద్దని, ప్రభుత్వం నుండి అనుమతి ఉన్న కంపెనీ విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, ప్రతిదానికి బిల్లులు తీసుకోవాలని ఇవ్వకపోతే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. నకిలీ విత్తనాలు కొని ఎవరైనా మోసపోతే భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) మీకు అండగా ఉంటుందని మమ్మల్ని సంప్రదించవచ్చని తెలిపారు.

## వైరా వ్యవసాయ
# మార్కెట్ కమిటీ చైర్మన్‌కి పెరుగుతున్న పోటీ..!




**-జనరల్ రేసులో పొదిలి హరినాధ్**
**-బిసి రేసులో ఏదునూరి దార్న, బోళ్ళ**









**ప్రజాపక్షం/వైరా:** వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశావాహులు పెద్ద ఎత్తున పోటీ పడుతున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రిజర్వేషన్ ఏది అవుతుందో ఇంకా ఖరారు కాలేదు. అప్పటికే పలువురు ఆశావులు పదవులపై కన్నేశారు. ఎవరికి వారే లాబియింగ్ నడిపిస్తున్నట్లు సమాచారం. వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బిసినే ఉంటుందా?ఓసి అవుతుందా అనే దానిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది. రిజర్వేషన్లు ఖరారై బిసినే ఉంటే చైర్మన్ పదవి ఎవరు వరిస్తుందో, జనరల్ అయితే చైర్మన్ పదవి ఎవరికి వస్తుంది అని చర్చ జరుగుతుంది. జనరల్ కేటగిరీలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మేనల్లుడు కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పేరు ఉన్న పొదిలి హరినాధ్ పేరు ప్రధానంగా వినిపిస్తుంది. అదేవిధంగా బిసి రిజర్వేషన్ అయితే పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అనుచరులు, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అత్యంత సన్నిహితులు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన ఏదునూరు సీతారాములు, బోళ్ళ గంగారావు, పొంగులేటి వర్గీయుడు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్‌కు అత్యంత సన్నిహితంగా ఉంటున్న దార్న రాజశేఖర్ పేరు వినిపిస్తుంది. అయితే ఈ క్రమంలో అసలు మార్కెట్ కమిటీ రిజర్వేషన్ ఏది అవుతుంది. స్థానిక శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ ఆశీస్సులు ఎవరికి ఉంటాయి? ఆ పదవి ఎవరిని వరిస్తుందో అనేది ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే త్వరలోనే నామినేటెడ్ పదవులు పూర్తి చేయనున్న సందర్భంలో వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇప్పుడు చర్చాంనీయాంశంగా మారింది. ఇప్పటికే ఎవరికి వారే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుపుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ వర్గాన్ని వరిస్తుందో ఎవరు చైర్మన్‌గా బాధ్యతలు చేపడతారో మరికొద్ది రోజుల్లోనే తేలిపోనుంది.

## ఏదునూరి చంద్రయ్యకు నివాళి



**ప్రజాపక్షం/వైరా:** వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు తండ్రి చంద్రయ్య గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్ అక్కడికి వెళ్లి ఏదునూరి చంద్రయ్య భౌతికఖాయం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏదునూరి సీతారాములుని పరామర్శించారు. ఏదునూరి చంద్రయ్య భౌతికఖాయం వద్ద నివాళి అర్పించిన వారిలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, పాలేటి నర్సింహారావు, దాసరి దానియేలు, పుచ్చకాయల వీరభద్రం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, పొదిల హరినాధ్, బోళ్ళ గంగారావు, వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పమ్మి అశోక్, శీలం వెంకటరామిరెడ్డి, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, పణితి శ్రీను, కన్నెగంటి నగేష్, మూడుముంతల గంగరాజు, పల్లపు కొండలు, బిడికె.రత్నం తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ సిసిఎల్‌ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారం పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఖమ్మంజిల్లానుంచి జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ లోక్ సభ సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రాష్ట్రంలో 1.3 లక్షల పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించామని ఆయన తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. సక్సెషన్ , పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను, రికార్డులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని , డేటా కరెక్షన్ దరఖాస్తులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలని ఆయన తెలిపారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అదనపు సిబ్బందిని కేటాయించాలని ఆయన తెలిపారు. ధరణి వెబ్‌సైట్‌కు సంబంధించి జిఎల్‌ఎం, టిఎం33 దరఖాస్తులలో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పులు చేస్తున్నామని కొన్ని సమస్యలు తహసీల్దార్ స్థాయిలో, మరికొన్ని సమస్యలు రెవెన్యూ డివిజన్ అధికారి, మరికొన్ని సమస్యలు కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళ, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూ సంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందని వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని సిసిఎల్‌ఏ కమిషనర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందని దీని కోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదిక అందించాలన్నారు. మార్కెట్ విలువ నమోదులో ఎక్కడ స్థానికంగా ఎటువంటి వివాదాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు అనువైన భవనం, భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని సిసిఎల్ ఏ కమిషనర్ తెలిపారు. సిసిఎల్‌ఏ నుంచి జిల్లా కలెక్టర్లకు రిటన్ వచ్చిన దరఖాస్తులలో అధికంగా ఆర్‌ఎస్‌ఆర్ దరఖాస్తులు, సంబంధిత అధారిత డాక్యుమెంట్లు జత చేయని దరఖాస్తులు ఉంటాయన్నారు. ఆర్‌ఎస్‌ఆర్ దరఖాస్తులలో తప్పుడు ఎంట్రీ జరిగిందా ధృవీకరించి తప్పుడు ఎంట్రీని తొలగించి ఆర్‌ఎస్‌ఆర్ సవరణకు రిపోర్టుతో సహా దరఖాస్తులు పంపాలని కలెక్టర్లకు సిసిఎల్‌ఏ కమిషనర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో అదనపు కలెక్టర్ , ఆర్డీవోలు, తహసీల్దార్ల స్థాయిలలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి పక్షం రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో జిల్లాలో 3,500 దరఖాస్తులు పరిష్కరించినట్లు, ఫిజికల్‌గా 5వేల దరఖాస్తులు పరిష్కరించినట్లు తెలిపారు. అనంతరం ఆర్డీవోలు, తహసీల్దారలతో కలెక్టర్ ధరణి దరఖాస్తుల పరిష్కారం పై సమీక్షించి పలు సూచనలు చేశారు. చిన్న చిన్న కారణాలతో దరఖాస్తులు తిరస్కరించవద్దని ఎలా ఆమోదించాలి అనే భావనతో ముందుకు వెళ్లాలన్నారు. తహసీల్దార్ రోజుకు కనీసం 25 దరఖాస్తులు పరిష్కరించాలని ఈ దిశగా కార్యాచరణ చేసి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా ధరణి మాడ్యూల్స్ పై తహసీల్దార్లకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు జి. గణేష్, ఎల్. రాజేందర్, కలెక్టరేట్ ఏవో అరుణ, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# టార్గెట్ జవాన్

**- మావోయిస్టుల ఎత్తుగడ - అటవీ మార్గాల్లో బూబీ ట్రూప్స్**
**- జవాన్లను హతమార్చేందుకు యత్నాలు**
**- చాకచక్యంగా నిర్వీర్యం చేస్తున్న భద్రతాబలగాలు**





**ప్రజాపక్షం/భద్రాచలం :** అడవుల్లో సమాంతర పాలన సాగించిన మావోయిస్టు పార్టీ ఇప్పుడు అంతర్మధనంలో పడింది. గత కొంత కాలంగా చోటు చేసుకుంటున్న ఎన్‌కౌంటర్లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మావోయిస్టులు ఉనికి కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. అడవుల్లో పట్టున్న వారు ఇప్పుడు తమదాడుకునేందుకు చాటుమాటు ప్రాంతాల కోసం అన్వేషిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ అడవులను పూర్తిగా ఆక్రమించిన కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాలు ప్రతీ అంశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాయి. మావోయిస్టు దాడుల వ్యూహకర్త హిడ్మ స్వగ్రామంలో జాతీయ జెండాను పాతడంతో తమ పట్టు సాధించుకున్న బలగాలు అడవుల్లో మావోయిస్టులు మట్టుపెట్టేందుకు అధునా తన బేస్ క్యాంపులను సైతం ఏర్పాటు చేస్తున్నాయి. ఈ ఆరు మాసాల కాలంలో చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్లలో వందమందికిపైగా మావోయిస్టులు హమతయ్యారు. దీంతో కొందరు లొంగుబాటపట్టారు. ఇప్పటికే చాలా మంది ఏపి,తెలంగాణ,ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో లొంగి పోయారు. కాగా ఇందులో ప్రధాన నాయకులు ఎవ్వరూ లేకపోవడం విశేషం.

**బూబీట్రూప్స్...**

భద్రతా బలగాలను హతమార్చేందుకు మావోయిస్టు పార్టీ అటవీ మార్గాల్లో బూబీట్రూప్స్ ఏర్పాటు చేశారు. కూంబింగ్ కోసం నడిచే దారుల్లో పెద్దపెద్ద గోతులు తీసి వాటిలో పదునైన ఇనుపచువ్వలతో పాటు విషపూరిత గాడు పెంకులు, ఇతర మందుగుండు సామాగ్రిని అమర్చుతున్నారు. అటుగావచ్చే జవాన్లు ఆ గోతుల్లో పడితే భారీ ఎత్తున ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే రెండు సార్లు బూబీ ట్రూప్స్‌ను భద్రతా బలగాలు చాకచక్యంగా వెలికి తీశాయి. 200 లకు పైగా పదునైన ఇనుపకడ్డీలను బయటకు తీశారు. ఐఇడి బాంబులు, బూబీ ట్రూప్స్ వల్ల ఇప్పటకే పలువురు అమాయక ఆదివాసీలు, మూగజీవాలు బలైపోతున్నాయని, అమాయక ఆదివాసీలకు మేలు చేస్తున్నామని చెప్పుకునే మావోయిస్టులు వారికి నష్టం చేకూరుస్తున్నారని పోలీసులు ఆరోపిస్తున్నారు.

## మెగా రక్తదాన శిబిరం విజయవంతం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆశ్రయ సేవా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా ఆశ్రయ సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం వారి సౌజన్యంతో ఖమ్మంలో మెగా రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహకులు ఇరుగు నవీన్ మాట్లాడుతూ రక్తం కృత్రిమంగా తయారు చేయలేరని అది మానవుని శరీరంలోనే తయారవుతుందన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానంచేసి నిండు ప్రాణాన్ని కాపాడాలన్నారు. అపోహాలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు మాట్లాడుతూ యువకులను, విద్యార్థులను, ప్రజాప్రతినిధులను, అధికారులను చైతన్యపరుస్తూ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి విజయవంతం చేసిన ఆశ్రయ సేవా సొసైటీ వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, ఆశ్రయ సేవా సొసైటీ నిర్వహకులు తగరం రమేష్, హెచ్. వినయ్, సందీప్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలో గొలుసు చోరీ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... రోటరీ నగర్‌లో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న లక్ష్మి అనే మహిళ వద్దకు ఓ వ్యక్తి ద్విచక్ర వాహనం పై వచ్చి పెరుగు ప్యాకెట్ కావాలని అడిగాడు. ఆమె పెరుగు ప్యాకెట్ తీసుకు వచ్చి ఇచ్చే క్రమంలో ఆమె మెడలో ఉన్న బంగారు నాంతాడు (పుస్తెలతాడు) గుంజుకుని ద్విచక్ర వాహనం పై వెళ్లిపోయాడు. ఆమె తెరుకుని కేకలు వేసే లోపే సదరు వ్యక్తి పారిపోయాడు. చోరీ అయిన బంగారు గొలుసు విలువ రూ. 2.50 లక్షలు ఉంటుందని బాధితురాలు వాపోయింది. టూటౌన్ పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలంకు చేరుకుని పరిసరాలను పరిశీలించి వివరాలు సేకరించారు. అదేవిధంగా గత నెలలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చైతన్య నగర్‌లో ఓ మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనం పై వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కోని పారిపోయాడు. వరుసగా చైన్ స్నాచర్లు చోరీలకు పాల్పడుతుండడంతో మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు.